### ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేకపూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ టౌన్, జూలై 21 : బాన్సువాడ పట్టణ పరిధిలోని కల్కి చెరువు కట్ట వద్ద ఉన్న సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు. అలాగే శ్రీజ్ఞానసరస్వతీ ఆలయంలో ఏర్పాటు చేసిన గురు పూజోత్సవ కార్యక్రమంలో పోచారం పాల్గొన్నారు.

## పోలీసుల వలకు చిక్కిన బ్యాంకు మేనేజర్?

**నిందితుడి బ్యాంకు ఖాతాలపై ఆరా**

వినాయక్‌నగర్, జూలై 21 : జిల్లాకేంద్రంలోని యూనియన్ బ్యాంక్ – శివాజీనగర్ బ్రాంచ్ మేనేజర్ అజయ్ బ్యాంకు ఖాతా దారులను బురిడీ కొట్టించి వారి ఖాతాల నుంచి సుమారు రూ. 4 కోట్ల మేర లూఠీ చేసి పరారైన విషయం తెలిసిందే. బాధితులు ఫోర్త్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. సీపీ కల్మేశ్వర్ ఆదేశాలతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి, ఏసీపీ రాజావెంకటరెడ్డి పర్యవేక్షణలో నగర సీఐ నరహరి ఆధ్వర్యంలో బ్యాంకు మేనేజర్ కోసం అన్వేషణ చేపట్టారు. సదరు మేనేజర్‌కు బ్యాం కు ఖాతాలు ఎక్కడెక్కడ ఉన్నాయి? ఖాతాదారుల నుంచి కాజేసిన డబ్బులు ఎక్కడ దాచారనే కోణంలో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. హైదరాబాద్‌కు బయల్దేరిన పోలీసు బృందాలు బ్యాంకు మేనేజర్ ఆచూకీ గుర్తించి, అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది.

# మంచం పట్టిన బోర్లం క్యాంపు

- కీళ్ల నొప్పులు, జ్వరంతో బాధపడుతున్న గ్రామస్తులు
- కొందరికి చికున్ గున్యా వ్యాధి నిర్ధారణ కావడంతో ఆందోళన చెందుతున్న గ్రామస్తులు



చికున్ గున్యా వ్యాధితో చికిత్స పొందుతున్న బోర్లం క్యాంపు గ్రామస్తులు

బాన్సువాడ రూరల్, జూలై 21 : కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలంలోని బోర్లం క్యాంపులో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. జ్వరం, కీళ్ల నొప్పులతో గ్రామస్తులు మంచం పడుతున్నారు. తీవ్రమైన కీళ్ల, కాళ్ల నొప్పులతో నడిచేందుకు ఇబ్బంది పడుతున్నారు. తీవ్రమైన జ్వరంతో బాధపడుతున్న కొందరు చికిత్స నిమిత్తం బాన్సువాడ ప్రైవేటు దవాఖానకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించుకోగా చికున్ గున్యా వ్యాధికి గురైనట్లు పరీక్షల్లో నిర్ధారణ అయ్యింది. దీంతో గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు గ్రామంలో మురికి కాలువలు శుభ్రం చేయకపోవడంతో దోమల బెడద తీవ్రంగా ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీలు పూర్తిగా మురికి నీటితో నిండి రోడ్లపై ప్రవహిస్తు న్నాయని వారు తెలిపారు. ఈ విషయమై గ్రామ పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా, నిధులు లేవంటూ సమాధానం చెబుతున్నారని, జిల్లా ఉన్నతాధికారులు చొరవ తీసుకొని డ్రైనేజీలు శుభ్రం చేయించడంతోపాటు గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## దాశరథి కృష్ణమాచార్యులవి.. మానవీయ రచనలు

- ప్రజావాగ్గేయకారుడు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న




దాశరథి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

సుభాష్‌నగర్, జూలై 21 : తన అక్షరాలతో తెలంగాణ ఉద్యమానికి ఊపిరిలూది... స్వయంగా ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లిన దాశరథి కృష్ణమాచార్యులు సమాజం కోసం మానవీయ రచనలు చేశారని ప్రజావాగ్గేయకారుడు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. ప్రజాకవి దాశరథి కృష్ణమాచార్య జయంతి నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చౌరస్తాలోని టీఎన్జీవోస్ భవనంలో దాశరథి 99వ జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గోరటి వెంకన్న హాజరై మాట్లాడారు. 'రైతుదే తెలంగాణం.. రైతుదే ముసలి నక్క రాచరికంబు దక్కునే' అని నిరంకుశ నిజాం ప్రభువును ధిక్కరించిన సాహసి దాశరథి అని కొనియాడారు. జిల్లా ఖిల్లా జైలు గోడల మీద 'ఓ నిజాం పిశాచమా కానరాదు... నా తెలంగాణ కోటి రతనాల వీణ' తెలంగాణ అస్థిత్వాన్ని ఎలిగెత్తి చాటిన మహాకవి దాశరథి అన్నారు. బావి తరాలకు దాశరథి గొప్పతనాన్ని తెలియజేసేందుకు జయంతి నిర్వహణ కమిటీ చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో నిర్వహణ కమిటీ అధ్యక్షుడు సిర్ప లింగం, మద్దికూరి సాయిబాబు, శ్రీనివాస్ ఆర్య, అష్ట గంగాధర్, కవులు, రచయితలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనం ఆహూతులను ఆకట్టుకున్నది.

## అ'పూర్వ' సమ్మేళనం

ఎల్లారెడ్డి రూరల్, జూలై 21: నలభై ఏండ్ల క్రితం (1982–84) ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ విద్యను పూర్తి చేసిన వారందరూ ఎల్లారెడ్డి పట్టణంలోని వీకేవీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. దూర ప్రాంతాల్లో నివసిస్తూ.. పలు ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తున్న వారందరూ ఒకే వేదికపై కలుసుకున్నారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలుకరించుకొని, కుటుంబ విషయాలను పంచుకున్నారు. రాచకొండ పోలీసు కమిషనరేట్‌లో ఇంటెలిజెన్స్ ఎస్పీగా పనిచేస్తున్న రంజన్ రతన్‌బాబు మాట్లాడుతూ.. ఇబ్బందుల్లో ఉన్న వారికి మనకు తోచిన విధంగా సహాయం చేద్దామని మిత్రులకు సూచించారు. సమ్మేళనంలో నునుగొండ ఆంజనేయులు, రాజ్‌కుమార్, రాజేందర్ నాథ్, చంద్రశేఖర్, శేర్ల వెంకటకృష్ణ, మరుమల్ల వెంకటేశం, విజయ్‌కుమార్, శ్రీనివాస్, బాబు, ప్రతాప్ రెడ్డి, నరేందర్ రెడ్డి, ఆకుల వెంకటేశం, ముప్పిడి అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న రాచకొండ పోలీస్ కమిషనరేట్ ఇంటెలిజెన్స్ ఎస్పీ రంజన్ రతన్‌బాబు



మాచారెడ్డిలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

**37 ఏండ్ల తర్వాత..**

మాచారెడ్డి, జూలై 21 : మండలంలోని చుక్కాపూర్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో 1987–88 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థులు 37 ఏండ్ల తర్వాత పాల్వంచ మండలం భవానీపేటలోని వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం ఒక్క చోట కలిశారు. అనంతరం ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకున్నారు. అప్పుడు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో అశోక్‌కుమార్, నర్సింహారెడ్డి, కృష్ణకుమార్, మంజుల, రమణ తదితరులు పాల్గొన్నారు.

## బాలుడి కిడ్నాప్ నిందితుల అరెస్టు

**కోర్టులో హాజరుపర్చనున్న పోలీసులు**

వినాయక్‌నగర్, జూలై 21 : నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ దవాఖాన నుంచి శనివారం తెల్లవారుజామున మూడేండ్ల బాలుడు అరుణ్‌ను కిడ్నాప్ చేసిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిసింది. నిందితుల్లో ఒకరు మెట్‌పల్లి వాస్తవ్యుడు కాగా.. మరొకరు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణానికి చెందిన వ్యక్తిగా పోలీసుల విచారణలో తేలింది. పోలీసుల అదుపులో ఉన్న ఇద్దరు నిందితులను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు విచారణ చేపడుతున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. నిందితులకు ఇప్పటివరకు గతంలో ఏదైనా నేరచరిత్ర ఉన్నదా అనే కోణంలో పోలీసులు వివరాలను సేకరిస్తున్నారు. నిందితులపై వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో కేసు నమోదు చేసి, సోమవారం కోర్టులో హాజరుపర్చనున్నారు.

### కామారెడ్డి జిల్లాలో ఇద్దరు సూపరింటెండెంట్ల బదిలీ

కామారెడ్డి, జూలై 21 : తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న కామారెడ్డి జిల్లాలోని ఇద్దరు సూపరింటెండెంట్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో డీసీహెచ్‌ఎస్‌గా విధులు నిర్వహిస్తున్న సివిల్ సర్జన్ డాక్టర్ విజయలక్ష్మి బాన్సువాడ ఏరియా దవాఖానకు బదిలీ అయ్యారు. బాన్సువాడలో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న డాక్టర్ శ్రీనివాస్‌ప్రసాద్‌ను బోధన్ దవాఖానకు బదిలీ చేశారు.

### రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు విద్యార్థుల ఎంపిక



ప్రతిభ చూపిన విద్యార్థులతో తైక్వాండో అసోసియేషన్ ప్రతినిధులు

కంఠేశ్వర్, జూలై 21 : జిల్లాకేంద్రంలోని మాధవనగర్‌లో ఉన్న బీఎల్ఎన్ గార్డెన్‌లో తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాజిరెడ్డి జగన్, ప్రధాన కార్యదర్శి, కోచ్ మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి తైక్వాండో పోటీలను ఆదివారం నిర్వహించారు. పోటీల్లో 70 మంది క్రీడాకారులు పాల్గొనగా.. 40 మంది క్రీడాకారులు గోల్డ్‌మెడల్, 20 మంది సిల్వర్, 10 మంది బ్రౌంజ్ మెడల్స్ సాధించారు. గోల్డ్‌మెడల్ సాధించిన క్రీడాకారులు ఈ నెల 27, 28 తేదీల్లో హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో నిర్వహించే పోటీల్లో పాల్గొననున్నట్లు కోచ్ తెలిపారు. కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ జిల్లా కోశాధికారి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## 'పసుపు లారీ హైజాక్' నిందితుల కోసం గాలింపు

**స్థానికులుగా గుర్తించిన పోలీసులు**


వినాయక్‌నగర్, జూలై 21 : జిల్లా కేంద్రంలోని గంజ్ ప్రాంతం నుంచి మూడురోజుల క్రితం పసుపు లోడ్‌తో గుంటూరుకు బయల్దేరిన లారీని ఆర్టీఏ అధికారులమని బెదిరించి, హైజాక్ చేసిన ఘటన తెలిసిందే. ఇందల్వాయి టోల్‌గేట్ వద్ద లారీ డ్రైవర్‌ను భయాభ్రాంతులకు గురి చేసి, సుమారు రూ. 40 లక్షల విలువ చేసే పసుపు లోడ్ లారీని ఎత్తుకుపోయారు. ఈ ఘటనపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, గాలింపు చర్యలు చేపడుతున్నారు. దొంగిలించిన లారీని తర్వాత రోజు నవీపేట్ ప్రాంతంలో గుర్తించారు. అయితే లారీని ఎత్తుకుపోయిన దుండగులు నిజామాబాద్ జిల్లాకేంద్రం నుంచి వెంబడించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇందల్వాయి టోల్‌గేట్ నుంచి నిత్యం భారీలోడ్‌తో పెద్ద సంఖ్యలో వాహనాలు వెళ్తుంటాయి. జిల్లాకేంద్రంలోని గంజ్ ఏరియా నుంచి పసుపులోడ్‌తో వెళ్లిన లారీ మాత్రమే టార్గెట్ చేశారంటే దుండగులు ఇక్కడి నుంచే లారీ వెంబడించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. లారీని దొంగిలించిన నిందితులు నిజామాబాద్‌కు చెందిన వారితోపాటు నవీపేట్ ఏరియాకు చెందిన వారు ఉన్నట్లుగా పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. వారిని పట్టుకునేందుకు ఏసీపీ రాజావెంకట్ రెడ్డి పర్యవేక్షణలో వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు ప్రత్యేక బృందంతో గాలింపు కొనసాగిస్తున్నారు. నిందితుల్లో ఒకరిని పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం.




## ఆటుపోట్లకు ఆస్కారం

**మార్కెట్ పల్స్**


**దేశీయ** స్టాక్ మార్కెట్లలో గత వారం సైతం నూతన రికార్డులు నమోదయ్యాయి. అయితే వరుస లాభాలతో సూచీలు గరిష్ఠ స్థాయిల్లో కదలాడుతున్న వేళ.. మదుపరులు లాభాల స్వీకరణ దిశగా అడుగులు వేశారు. దీంతో ఓవరాల్‌గా స్వల్ప లాభాలతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 85.31 పాయింట్లు పెరిగి 80,604.65 వద్ద నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 28.75 పాయింట్లు అందుకుని 24,530.90 దగ్గర ముగిసింది. శుక్రవారం భారీ నష్టాలు వాటిల్లకపోతే సూచీలు నయా ఆల్‌టైమ్ హైల్లోనే ఉండేవి. ఇక ఈ వారం కూడా మదుపరులు ఆయా సంస్థల త్రైమాసిక ఆర్థిక ఫలితాల ఆధారంగా తమ పెట్టుబడులపై నిర్ణయం తీసుకునే వీలున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2024–25)గాను తొలి త్రైమాసికం (ఏప్రిల్–జూన్) కోసం కంపెనీలు తమ ఫైనాన్షియల్ రిజల్ట్స్‌ను ప్రకటిస్తున్న విషయం తెలిసిందే. అయినప్పటికీ సూచీలు రికార్డుస్థాయి గరిష్ఠాల్లో ఉన్నందున పెట్టుబడులు–ఉపసంహరణల మధ్య ఇన్వెస్టర్లు కొట్టుమిట్టాడేందుకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కాగా, గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఎప్పట్లాగే ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 24,200 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 23,900 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 24,700–24,900 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.



## ఆఖర్లో కాదు..

### రుణ చెల్లింపుల్లో లాభం ఇలా

**మనలో** ప్రతి ఒక్కరూ ఎప్పుడో ఒకప్పుడు బ్యాంకుల్లో లేదా బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల్లో రుణాన్ని తీసుకోవడం సహజం. అయితే ఆ రుణ భారాన్ని వీలైనంత త్వరగా తీర్చేసుకుందామనుకొని కొన్ని పొరపాట్లు చేస్తూంటారు. దీనివల్ల నష్టాల పాలవుతూంటారు. అందుకే రుణ చెల్లింపుల విషయంలో ఎప్పుడు? ఎలా? అన్నది అత్యంత ముఖ్యమైన అంశం. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల్లో లోన్లు తీసుకున్నప్పుడు.. వడ్డీతో కలిపి ఆ మొత్తాన్ని నిర్ణీత లేదా రుణగ్రహీత ఎంచుకున్న కాలవ్యవధికి సమాన ఈఎంఐలుగా పంచుతారు. అయితే ఈ నెలవారీ వాయిదాల్లో మొదట చెల్లిస్తూపోయే వాటిలో ఎక్కువ మొత్తం రుణంపై రుణదాతలు వసూలుచేసే వడ్డీనే ఉంటుంది. కాలం గడుస్తున్నకొద్దీ చివర్లో ఉండే ఈఎంఐల్లో వడ్డీకన్నా అసలే ఉంటుంది. అంటే.. రుణం తీసుకున్న తొలినాళ్లలో చెల్లించే ఈఎంఐల్లో ఎక్కువ మొత్తం వడ్డీ కిందనే పోతుంది. అసలు రుణంలో మైనస్ అయ్యేది చాలా తక్కువ. అలాగే ఆఖర్లో చెల్లించే ఈఎంఐల్లో వడ్డీకన్నా అసలు రుణమే ఎక్కువగా ఉంటుంది. కాబట్టి రుణ భారం తగ్గించుకోవాలనుకునేవారు మొదట్లోనే వీలైనంత చెల్లించడం మంచిది. ఆఖర్లో ఒకేసారి చెల్లించడం కన్నా ఈఎంఐలను అనుసరించడమే లాభదాయకం.




**లోన్ పోర్టబులిటీ**


రుణాలపై వివిధ బ్యాంకులు, సంస్థలు రకరకాల వడ్డీరేట్లను అనుసరిస్తూంటాయి. రుణగ్రహీత సిబిల్ స్కోర్‌తోపాటు మరి కొన్ని అంశాలు ఇందులో ప్రధాన పాత్ర పోషిస్తాయి. అయితే మనం తీసుకున్న రుణంపై వడ్డీరేటు ఎక్కువగా ఉందనుకుంటే.. ఎందులో తక్కువగా ఉందో తెలుసుకుని ఆ మొత్తం రుణాన్ని అక్కడికి మార్చుకోవడం ఉత్తమం. దీన్నే లోన్ పోర్టబులిటీ అం టారు. దీనివల్ల వడ్డీ భారం తగ్గుతుంది. కానీ ఈ ప్రక్రియకు కొన్ని చార్జీలు వర్తిస్తాయి. వీటన్నిటినీ కలిపి లెక్కించే రుణాన్ని ఒక సంస్థ నుంచి మరో సంస్థకు మార్చుకోవడం లాభమా? నష్టమా? అన్నది తేల్చుకోవాలి. లేకపోతే భారం మరింత పెరిగే ప్రమాదం ఉన్నది.

# ఐటీఆర్‌లో సెక్షన్‌తో కొడదాం




*ఇది ఆదాయ పన్ను రిటర్న్ (ఐటీఆర్)ల కాలం. 2023-24 ఆర్థిక సంవత్సరానికి (2024-25 మదింపు సంవత్సరం) గాను ఈ నెలాఖర్లోగా (జూలై 31) ఐటీఆర్‌ను దాఖలు చేయాల్సి ఉంటుంది. దీంతో పన్ను ఆదా కోసం ఉన్న మార్గాలను అంతా వెతుకుతున్నారు. అయితే అందరికీ తెలిసింది సెక్షన్ 80సీ మాత్రమే. కానీ ఐటీ చట్టంలోని వివిధ సెక్షన్ల కింద రకరకాల పెట్టుబడులు, ఖర్చులు, రుణాల చెల్లింపులు, వడ్డీ ఆదాయాలపై పన్ను మినహాయింపును పొందవచ్చు. వాటిని పరిశీలిస్తే..*

### పన్ను ఆదాకున్న 10 రకాల మార్గాలివే..




**1. నేషనల్ పెన్షన్ సిస్టమ్**

నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్)లో పెట్టుబడులకు సెక్షన్ 80సీ కింద రూ.1.5 లక్షలదాకా పన్నును ఆదా చేసుకోవచ్చు. ఇక సెక్షన్ 80సీసీడీ (1బీ) కింద అదనంగా మరో రూ.50,000 ఆదా చేయవచ్చు. మొత్తంగా రూ.2 లక్షలు ఆదా అవుతాయి.

**2. ఆరోగ్య బీమా**

సెక్షన్ 80డీ కింద ఆరోగ్య బీమా ప్రీమియంను క్లెయిం చేసుకోవచ్చు. ఎంత? అన్నది పాలసీ కవరేజీ, వయసుపై ఆధారపడి ఉంటుంది. ఇలా రూ.25,000, రూ.50,000, లక్ష రూపాయల వరకు పన్ను ఆదా చేసుకోవచ్చు.

**3. విద్యా రుణం**

పిల్లల విద్య కోసం రుణం తీసుకున్నట్టయితే.. దాని చెల్లింపులపైనా పన్ను మినహాయింపును క్లెయిం చేసుకోవచ్చు. సెక్షన్ 80ఈ కింద విద్యా రుణంలోని వడ్డీ భాగంపై పన్ను మినహాయింపును పరిమితి అనేదే లేకుండా పొందవచ్చు. రుణాన్ని చెల్లించేది తల్లిదండ్రులా.. పిల్లలా.. అన్న తేడా లేకుండా ఈ ప్రయోజనాన్ని అందుకోవచ్చు.

**4. హోమ్ లోన్ వడ్డీ**

గృహ రుణ చెల్లింపులపై రెండు మార్గాల్లో పన్ను మినహాయింపును క్లెయిం చేసుకోవచ్చు. ఒకటి సెక్షన్ 80సీ కింద అసలుపై రూ.1.5 లక్షల వరకు పన్ను ఆదా చేసుకోవచ్చు. మరొకటి సెక్షన్ 24 కింద వడ్డీ భాగంపై రూ.2 లక్షలదాకా పన్ను ఆదా కోరవచ్చు. కొన్న ఇంట్లో మీరున్నా.. లేదా దానిపై అద్దె ఆదాయం పొందుతున్నా.. పన్ను మినహాయింపులను అందుకోవచ్చు.

**5. తొలిసారి ఇంటి కొనుగోలుపై**

తొలిసారి ఇంటిని కొనుగోలుచేసేవారికి సెక్షన్ 80ఈఈ కింద గృహ రుణ వడ్డీపై కేంద్ర ప్రభుత్వం అదనపు పన్ను ప్రయోజనాలను కల్పిస్తున్నది. ఈ సెక్షన్‌లో రూ.50,000 వరకు ఎక్స్‌ట్రా ట్యాక్స్ క్లెయిములు చేయవచ్చు. సెక్షన్ 24 కింద వర్తించే మినహాయింపులకు అదనం. దీంతో రూ.2.5 లక్షల వరకు ప్రయోజనం ఉంటుంది. అయితే మీ పేరిట అంతకుముందు ఏ ఇల్లూ ఉండరాదు. అలాగే కొనే ఇంటి విలువ రూ.50 లక్షలు మించరాదు. తీసుకునే అప్పు కూడా రూ.35 లక్షలు దాటరాదు.

**6. హెచ్‌ఆర్‌ఏ**

ఉద్యోగులకు వారి సంస్థ యాజమాన్యాలు హౌజ్ రెంట్ అలవెన్స్ (హెచ్‌ఆర్‌ఏ)ను ఇస్తే.. అద్దెపై పన్ను మినహాయింపును పొందవచ్చు. సెక్షన్ 80జీజీ కింద ఈ అవకాశం ఉంటుంది.

**7. ఎస్‌బీ అకౌంట్ వడ్డీ**

సేవింగ్స్ బ్యాంక్ (ఎస్‌బీ) అకౌంట్ నుంచి అందుకునే వడ్డీ ఆదాయంపైనా పన్ను మినహాయింపును కోరవచ్చు. వడ్డీ ఆదాయం రూ.10,000 వరకుంటే సెక్షన్ 80టీటీఏ కింద ఎవరైనా వ్యక్తి లేదా హిందూ అవిభాజ్య కుటుంబం (హెచ్‌యూఎఫ్) ఐటీ ప్రయోజనాన్ని పొందవచ్చు.

**8. దివ్యాంగుల కేర్ టేకర్‌గా..**


మీరు దివ్యాంగుల బాగోగులు చూసుకుంటున్నట్టైతే సెక్షన్ 80డీడీ కింద వారి ఖర్చులపై పన్ను మినహాయింపులను కోరవచ్చు. అంగ వైకల్యాన్నిబట్టి మినహాయింపు ఎంత? అన్నది తెలుస్తుంది. రూ.75,000–రూ.1.25 లక్షల మేర ఉంటుంది.

**9. వైద్య ఖర్చులకు..**

క్యాన్సర్, నరాల వ్యాధులు, ఎయిడ్స్ వంటి రోగాల వైద్య ఖర్చులపైనా ఐటీ మినహాయింపును తీసుకోవచ్చు. సెక్షన్ 80డీడీబీ కింద రూ.40,000 వరకు పన్ను తగ్గింపును పొందవచ్చు. సీనియర్ సిటిజన్లకైతే లక్ష రూపాయలదాకా ప్రయోజనం ఉంటుంది.

**10. విరాళాలు**

విరాళాలపై సెక్షన్ 80జీ కింద పన్ను మినహాయింపును క్లెయిం చేయవచ్చు. అయితే మొత్తం డొనేషన్‌పై ప్రయోజనం రాదు. అలాగే గుర్తింపు పొందిన ఛారిటబుల్ సంస్థకు విరాళం ఇస్తేనే ఈ సౌకర్యం ఉంటుంది.



### నిల్ ఐటీఆర్‌తో లాభాలివి..

పన్ను వర్తించే శ్లాబులో మీ ఆదాయం ఉన్నట్టైతే.. ప్రతీ ఆర్థిక సంవత్సరం ఐటీఆర్‌ను తప్పక దాఖలు చేయాల్సిందే. అయితే ఆదాయ పన్ను పరిధిలో మనం లేము కదా.. అని చాలా మంది ఐటీఆర్‌ను లైట్ తీసుకుంటారు. కానీ ఐటీ పరిధిలోకి రాకున్నా.. ఏటా నిల్ ఐటీఆర్‌ను దాఖలు చేస్తే పలు ప్రయోజనాలున్నాయి. 60 ఏండ్లలోపున్నవారికి పాత పన్ను విధానంలోనైతే రూ.2.5 లక్షలు, కొత్త పన్ను విధానంలోనైతే రూ.3 లక్షలదాకా వార్షిక ఆదా యం ఉన్నా పన్నులు చెల్లించనక్కర్లేదు. ఇక నిల్ ఐటీఆర్‌ను దాఖలు చేస్తే వీసా దరఖాస్తుల కోసం ప్రధాన ఆదాయ ధ్రువీకరణగా ఉంటుంది. అలాగే రుణాలను తీసుకునేటప్పుడు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ట్యాక్స్ రిఫండ్స్‌కూ దోహదపడుతుంది.